క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం: నిరుపేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు, ఇల్లు నిర్మించి ఇవ్వలేకపోయారని, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు భూమి, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు భూమి ఇవ్వాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుదే శ్రీను, ఇళ్ళ నరసయ్య, పులిబోయిన శ్రీను, దాసరి కృష్ణ, తేలే నరసింహరావు పాల్గొన్నారు.

భోగలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఉమా భోగలింగేశ్వరస్వామి

పోలవరం రూరల్: కార్తీక మాసం సందర్భంగా పోలవరం మండలం గుంజవరం గ్రామంలో వెలసిన ఉమా భోగలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాకారంలో శివ పార్వతులకు కల్యాణ మహోత్సం, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పశుసంవర్ధక శాఖ జేడీ పర్యటన



పశువులకు చికిత్స చేస్తున్న జేడీ జేసురత్నం

కొయ్యలగూడెం: పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జేసురత్నం బుధవారం కొయ్యలగూడెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం, పరింపూడి పశు వైద్యశాలల్లో పశువులకు చికిత్స చేశారు. గైనిక్ మందుల పంపిణీ, గేదెలకు, దున్నలకు కాళ్లకు సంబంధించిన దీర్ఘకాలిక రోగాలకు చికిత్స నిర్వహించి, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం పశు వైద్యశాలల్లో ఉన్న స్టాక్‌కు సంబంధించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. పశు వైద్యశాఖాధికారులు బీఆర్ శ్రీనివాసన్, డాక్టర్ సత్యదుర్గ, పీఎస్‌వీ శేఖర్ దొర, తదితరులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో వ్యక్తి బైండోవర్

చింతలపూడి: మండలంలోని నామవరం గ్రామానికి చెందిన బోడా రామారావుపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. పలు సారా కేసులు, బెల్లం ఊట కేసుల్లో నిందితుడిగా ఉన్న రామారావును బుధవారం తహసీల్దార్ డి.ప్రమద్వర ఎదుట హాజరు పరిచి 129 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పొట్టకూటి కోసం జీవన పోరాటం

- వందల మైళ్లు దాటి వచ్చి కష్టపడుతున్న వైనం
- ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన బడుగు జీవులు

జంగారెడ్డిగూడెం: పొట్టకూటి కోసం వందల మైళ్లు దాటి వచ్చి జీవన పోరాటం చేస్తున్నారు. ఎవరో వచ్చి సాయం చేస్తారని ఎదురుచూడకుండా, ఉన్న కొద్ది ధనంతోనే చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంత ఊరిలో చేసేందుకు సరైన పనిలేక, కాలాన్ని నమ్ముకుని, దూరాన్ని లెక్క చేయకుండా, మొక్కవోని ధైర్యంతో ఊరు కాని ఊరు వచ్చి చిరు వ్యాపారాలు సాగిస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు చిరు వ్యాపారులు జంగారెడ్డిగూడెం పట్టణంలో చిన్న చిన్న టెంట్లు వేసుకుని రగ్గులు తదితర శీతాకాల వస్తువులు అమ్ముకుంటారు. ప్రతీ సీజన్‌కు వారు ఇక్కడకు వచ్చి, వ్యాపారం చేసుకుని సీజన్ ముగిసిన వెంటనే వారి ఊరు వారు వెళ్లిపోతుంటారు. తమ గ్రామాల్లో ఏడాది పొడవునా ఉపాధి సరిగా లేకపోవడంతోనే తాము వలసలు వచ్చి ఇక్కడ చిరు వ్యాపారాలు సాగిస్తున్నామని వారు పేర్కొంటున్నారు. తమకు ఉన్న కొద్ది మొత్తంతో పంజాబ్ నుంచి స్టాక్‌ను తీసుకువస్తామని, డిమాండ్‌ను బట్టి అదనపు స్టాక్ కోసం ఇక్కడి నుంచి ఆర్డర్లు పెట్టడం జరుగుతుందని వారు తెలుపుతున్నారు. ఇలా జంగారెడ్డిగూడేనికి 15 మంది వరకు వచ్చారు. ఇక్కడి నుంచి వేర్వేరు ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని రెయిన్ కోట్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు అమ్ముకుంటారు. నాలుగు నెలల పాటు ఇక్కడే ఉండి వ్యాపారాలు సాగిస్తుంటారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్లలో ఈ దుకాణాలు వెలిశాయి. కాగా సీజన్ ముగిసిన వెంటనే వారి స్వగ్రామాలకు వెళ్లిపోయి, మిగిలిన నెలల్లో అక్కడ దొరికే కూలీ నాలీ పనులు చేసుకుని జీవిస్తారు.



జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన దుకాణం

ప్రతి శీతాకాలం సీజన్‌కు వస్తుంటాం



సీజన్‌లో నాలుగు నెలలు రగ్గుల వ్యాపారం నిర్వహించుకుని వెళతాం. సీజనల్ వ్యాపారాలు చేసుకుంటాం. మిగిలిన కాలం మా స్వగ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాం. నాకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలను చదివించుకుంటున్నా. బేరాలు బాగుంటే లాభాలు ఉంటాయి. ఒక్కోసారి లాభాలు ఉండవు. అయినా తప్పక ఈ వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– కల్లు చావడ, మధ్యప్రదేశ్, ఆగర్ జిల్లా, మందిర్‌వాలాదేరా గ్రామం

14 ఏళ్లుగా వస్తున్నాం



ఈ ప్రాంతానికి 14 ఏళ్లుగా వచ్చి ప్రతీ సీజన్‌కు రగ్గుల వ్యాపారం చేస్తున్నాం. నా మీద నా తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఆధారపడి ఉన్నారు. ప్రతీ సీజన్‌కు సరుకులు తీసుకు వస్తుంటాం. తీసుకొచ్చిన సరుకు ఒక్కోసారి మిగిలిపోతుంటాయి. దానిని ఇక్కడే ఒక రూమ్‌లో భద్రపరుస్తాం. ఎక్కువ కాలం సీజనల్ వ్యాపారాలు చేసుకుంటూ ఈ ప్రాంతంలో ఉంటూ ఉంటాం. వ్యవసాయ సీజన్‌లో మాత్రం మా స్వగ్రామం వెళ్లి వ్యవసాయ పనులు చేస్తుంటాం. సుమారు 15 మంది వరకు ఈ ప్రాంతానికి వచ్చి ఈ వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– వకీల్ చౌహాన్, మధ్యప్రదేశ్, ఆగర్ జిల్లా, జెండావలీ గ్రామం

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామంలో నదీ తీరంలో కొలువైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అవతరించిన రోజు సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన అర్చకస్వామి వీవీఎస్ శ్రీనివాస్ కుమార్ నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి

జంగారెడ్డిగూడెం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతిని జంగారెడ్డిగూడెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బైనేరు వద్ద వేంచేసియున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సహస్ర నామార్చన, సాయంత్రం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ కోరుమల్లి సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, ఉమామహేశ్వరరావులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వెలుగు సిబ్బందితో వెట్టి పనులు



తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న భవనాన్ని శుభ్రం చేస్తున్న వెలుగు కార్యాలయ సిబ్బంది

కామవరపుకోట: డ్వాక్రా మహిళలకు మండల మహిళా సమాఖ్య ద్వారా సేవ చేయవలసిన సిబ్బంది బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న మండల సమాఖ్య కార్యాలయంలో బూజులు దులుపుతూ, గోడలకు వాటరింగ్ చేస్తూ స్థానికులకు కనిపించారు. వివరాల్లోకి వెళితే వెలుగు కార్యాలయం స్థానిక కొత్తూరులో అద్దె భవనంలో ఉంది. అయితే పాతూరు తహసీల్దార్ కార్యాలయ వద్ద అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న భవనంలో మండల సమైక్య సమావేశం నిర్వహించడానికి గాను భవనం లోపల చీపురుతో బూజులు తుడుస్తూ ఇద్దరు మహిళా సిబ్బంది, వాటర్‌తో గోడలు కడుగుతూ ఇద్దరు పురుష సిబ్బంది స్థానికులకు కనపడ్డారు. దీంతో అధికారులు, దిగువ స్థాయి సిబ్బందితో ఆఫీసు సేవలు చేయించకుండా ఇలాంటి పనులు చేయించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ మహిళా ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: విధుల నిర్వహణలో అనుకూల పరిస్థితులు కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని, వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుధవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ యు.రవిచంద్ర, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు జంగారెడ్డిగూడెం మున్సిపల్ వార్డు సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాష్‌బోర్డు పరుగుపందెం అనేది ప్రభుత్వ ఉత్సాహమో లేక అధికారుల ఉత్సాహమో తెలియడం లేదన్నారు. వివిధ సర్వేల్లో అన్ని జిల్లాల్లో, అన్ని మండలాల్లో ప్రజల జీవన విధానం, ఆలోచన శైలి, పరిసర ప్రాంతాలు ఒకేలా ఉండన్నారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో పని ఒత్తిడి, జనాభా, ఉద్యోగుల నిష్పత్తి సైతం ఒకేలా లేదని, దీని వల్ల సర్వీస్ డెలివరీ, సర్వేలపై ప్రభావాన్ని చూపిస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులు సచివాలయ సిబ్బంది భద్రత విషయంలో పనిపట్ల అనుకూల పరిస్థితులు కల్పించుటలో సరైన నిర్ణయం తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిమితి మేరకు పొగాకు సాగుచేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్

జంగారెడ్డిగూడెం: రైతులు పరిమితి మేరకే పొగాకును సాగు చేయాలని వర్జీనియా పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-1లో బుధవారం రైతులకు పొగాకు ఉత్పత్తి నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ముగిసిన సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక పంట వైపు వెళ్లరాదన్నారు. అక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి మాట్లాడుతూ పొగాకుకు గత సంవత్సరం లభించిన ధరలను చూసి బ్యారెన్లు, పొలాలను అధిక ధరలకు తీసుంటున్నారని చెప్పారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి కె.సుధీర్‌మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మక్కువ చూపాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ పొగాకు రైతు వారి బ్యారన్ దగ్గర పది మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యుక్త వయసులో విద్యార్థులు అనేక రకాల చెడు అలవాట్లకు అలవాటు పడుతున్నారని, వాటిలో ఒకటి మత్తు పదార్థాల వినియోగం ఒకటన్నారు. వీటిని అలవాటు చేసుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువత నాశనం కావడం వల్ల దేశ భవిష్యత్తు కూడా నాశనం అవుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యర్నం సాయికిరణ్

కుక్కునూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కుకునూరు మండల కమిటీ సమావేశం అశ్విని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చేయాలని, 8 నెలలుగా బకాయిలు హాస్టల్ మెస్ చార్జీలను విడుదల చేయాలని, జీవో నెంబర్ 82 ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ అండ్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుక్కునూరు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వర్క లక్ష్మణ్ కుమార్ సభ్యులు ప్రవళిక, సాయి భాస్కర్, ప్రేమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



డాక్టర్ సుబ్రమణ్యం మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యకర్త మాతృమూర్తి మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులైన డాక్టర్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ దంపతులను వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయ రాజు బుధవారం పాతూరులో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. డాక్టర్ సుబ్రమణ్యం మాతృమూర్తి చిత్ర పటానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సాయినా కనకరాజు, దేవరపల్లి రామ్మోహన్‌రావు, మేడంకి చిన్న, మెరుగు బాబురావు, ధర్మ, సురేష్, మల్లేష్, సాయల స్వాతి, ప్రశాంతి పాల్గొన్నారు.

అయ్యప్పకు సప్తనదీ జలాల అభిషేకం



సప్తనదీ జలాలతో అయ్యప్ప స్వామి ఆలయానికి వెళుతున్న కన్నె స్వాములు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయానికి 108 మంది కన్నెస్వాములు సప్తనదీ జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. తొలుత జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన కన్నెస్వాములు, సప్త నదీజలాలతో ఊరేగింపుగా అయ్యప్ప ఆలయానికి వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు తేజశర్మ స్వామి వారికి అభిషేకం చేశారు. సాయంత్రం ఆలయంలో మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కీసరి రామిరెడ్డి, సెక్రటరీ నెక్కలపూడి సూర్యచంద్రరావు, చిన్ని వాసు స్వామి, గంగు జగన్మోహన్‌రెడ్డి, ఖాకి శ్రీనివాసరెడ్డి, కెకె గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటుడు సుభాష్



అభిమానితో సినీ నటుడు సుభాష్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని పుష్ప ఫేమ్-2 కమెడియన్ సుభాష్ బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయ అనివేటి మండపంలో పలువురు అభిమానులు ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

కుక్క దాడిలో వృద్ధుడికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

చింతలపూడి: చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో బుధవారం వీధి కుక్క దాడిలో ఒక వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇంట్లో నుంచి బయటికొచ్చిన బి.శంకర్రావు అనే వృద్ధుడిని వీధి కుక్క వెంటపడి కరవడంతో కాలికి తీవ్ర గాయమైంది. శంకర్రావు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వైద్యులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీవారి ట్రస్టుకు మందుల అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం నిర్వహిస్తున్న ప్రాణదాన ట్రస్టుకు ఒక దాత బుధవారం ఉచితంగా మందులను అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 4 వేల మంది భక్తులకు సరిపడా మందులను ప్రథమ చికిత్సా కేంద్రంలో వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు ఆయన అందజేశారు. ఆలయ అధికారులు దాత సాంబశివరావును ప్రత్యేకంగా అభినందించారు.

చింతలపూడి నియోజకవర్గంలో విలీనం చేయాలి

టి.నరసాపురం: మండలాన్ని చింతలపూడి నియోజకవర్గంలో విలీనం చేయాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టి.నరసాపురం మండలానికి సంబంధించి పలు సమస్యలపై కలెక్టర్ వెట్రిసెల్వీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.నరసాపురాన్ని చింతలపూడి నియోజకవర్గంలో విలీనం చేయడంతో పాటు, జిల్లా పరిధిలోని ప్రధాన రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరామన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌డీ జమీలా బేగం, అబ్దుల్లా ఉన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ, ఎస్పీ

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో, జేసీ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏలో ప్రజల నుంచి బుధవారం పలు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అనంతరం వన్‌దన్ వికాస్ కేంద్రాల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు.

రెడ్డిగూడెం గ్రామాన్ని సందర్శించిన జేసీ, ఎస్పీ: మండలంలోని మారుమూల గ్రామమైన రెడ్డిగూడెం గ్రామాన్ని బుధవారం జేసీ పి.ధాత్రిరెడ్డి జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బోధ బస్సు పుస్తక ప్రదర్శనను పరిశీలించారు. ఈ ప్రదర్శనలో చిన్న పిల్లలకు మొబైల్ బస్ పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పాఠ్యాంశాలపై బాలికలకు వివరించారు. రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందజేస్తున్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలంకరణ



మదన గోపాల స్వామి ఆలయంలో కార్తీక దీపాలంకరణ చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కార్తీకమాసం సందర్భంగా శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, పాలకమండలి చైర్మన్ మద్దు గోపి పర్యవేక్షణలో శ్రీ సహస్ర దీపాలంకరణలతో దేవతామూర్తుల చిత్రాలను దీపపు ప్రమిదల ఆకారంతో నిర్మించారు. శంకు చక్ర తిరునామాలతో పాటు ఆలయ ప్రాంగణంలోని నలువైపులా మూడు వేలకు పైగా ప్రమిదలతో దీపాలంకరణ సేవ చేశారు. కార్తీకమాసం ముగిసే వరకు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలంకరణ సేవలు నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాల్సిందిగా పాలక మండలి సూచించింది.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై కేసు

టి.నరసాపురం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం జయబాబు తెలిపారు. ఇంటర్మీడియేట్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్న మండలంలోని వెలగపాడుకు చెందిన యువతి ఇటీవల తల్లితో కలిసి అదే గ్రామానికి చెందిన బొడ్డు వంశీకి చెందిన పత్తి చేలో కూలికి వెళ్లిందన్నారు. దీంతో వంశీతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెను వంశీ శారీరకంగా అనుభవించాడని పేర్కొన్నారు. పెళ్లిచేసుకోవాలని అడగడంతో వంశీ అతని కుటుంబ సభ్యులు యువతిపై దాడి చేసి కొట్టారన్నారు. ఈ మేరకు యువతి ఫిర్యాదుతో యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప తెలిపారు. బుధవారం ఆమె తహసీల్దార్ జేవీ సుబ్బారావుతో కలిసి గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను అందజేశారు.

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం శాఖా గ్రంథాలయంలో 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి మీర్జా రియాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో అధిక సంఖ్యలో పాఠకులు, చిన్నారులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

కొయ్యలగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గవరవరంలో ర్యాలీ నిర్వహించారు.